దసరాకు ఆలయాల ముస్తాబు

దసరా సందర్భంగా ఆదివారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు శరన్నవరాత్రి వేడుకలు జిల్లాలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం వివిధ గ్రామాల్లో ఆలయాలను ముస్తాబు చేశారు. ఆయా గ్రామాల్లోని కూడలి ప్రాంతాల్లో ప్రత్యేక పందిళ్లు తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు.


గంపలగూడెం గాంధీ సెంటర్‌లో శరన్నవరాత్రి ఏర్పాట్లు

నూజివీడు: ఆంధ్రా మైసూర్‌గా పేరు గాంచిన నూజివీడులో దసరా సంబరాలను నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. దసరాను పురస్కరించుకుని పట్టణంలోని పురాతన ఆలయమైన శ్రీ కోట మహిషాసురమర్దని అమ్మవారి ఆలయంలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు 67వ శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఇప్పటికే ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్ వరకు, అటు పెద్దగాంధీ బొమ్మ సెంటర్ వరకు రహదారికి ఇరువైపులా విద్యుద్దీపాలను అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారిని విశేషంగా అలంకరించనున్నారు. 19న ఉదయం 8గంటల నుంచి ఆలయ ఆవరణలో శ్రీ చక్రనవావరణ సహిత చండీ హోమం, 20న విద్యార్థులతో సరస్వతీదేవి పూజ నిర్వహిస్తామని ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. దసరా రోజున రాత్రి 8 గంటలకు ఆలయ ఆవరణలో పోలీసు అధికారులతో శమీపూజ (ఆయుధ పూజ) నిర్వహించి అనంతరం రాత్రి 10 గంటల నుంచి అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు నూజివీడు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా ఇతర దూరప్రాంతాల నుంచి సైతం దసరా ఉత్సవాలకు ఏటా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు.


శరన్నవరాత్రి వేడుకలకు సిద్ధమవుతున్న నూజివీడులోని కోట మహిషమర్ధని ఆలయం

శరన్నవరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

గంపలగూడెం: గంపలగూడెం గాంధీ సెంటర్లో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇక్కడ ప్రత్యేక పూజలతో పాటు అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. వినగడప పంచముఖ సుందర హనుమత్ పీఠం, మేడూరు భ్రమరాంబ సహిత రామలింగేశ్వర స్వామి ఆలయం, పెనుగొలను రామలింగేశ్వర స్వామి ఆలయం, మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి ఆలయం, ఊటుకూరు గాంధీ సెంటర్లో వాసవిక్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో, తోటమూల ఆంజనేయస్వామి ఆలయం వద్ద అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పెనుగొలనులో బొడ్డురాయి సెంటర్, మిల్లు సెంటర్, ఊటుకూరు రోడ్డు, వాటర్ ట్యాంక్ రోడ్లలో ప్రత్యేక నవరాత్రి శిబిరాలను ఏర్పాటు చేశారు. ఆయా శిబిరాల ఆలయాల్లో అమ్మవార్లకు ఒక్కరోజు ఒక అలంకరణ గావించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు

తిరువూరు: పట్టణంలోని దేవాలయాల్లో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాజుపేట శ్రీ అష్టలక్ష్మీ ఆలయం, శాంతినగర్ శ్రీకనకదుర్గాలయం, శ్రీగౌరీ కేదారేశ్వరస్వామి దేవస్థానం, షిర్డిసాయి మందిరం, రుక్మిణీ కృష్ణ ఆర్యవైశ్య కల్యాణమంటపం, జైహింద్ మిల్ సెంటర్లలో దసరా వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో 15న ఏక్ మినిట్ కార్యక్రమం, 16న మ్యూజికల్ ఛైర్స్, 17న సౌందర్య లహరి, 18న గ్రూప్ గేమ్, 19న సిల్వర్ హౌజీ, 20న సరస్వతీదేవికి పూజలు, 21న సువాసిని పూజలు జరపనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. గౌరీ కేదారేశ్వరస్వామి దేవస్థానంలో ప్రతిరోజూ ఉదయం 8.30 గంటలకు సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తామని ప్రధానార్చకులు అప్పయ్య శాస్త్రి, శ్రీనివాసశర్మ తెలిపారు.


నూజివీడులోని శ్రీ కోట మహిషాసురమర్దిని అమ్మవారు


ఇబ్రహీంపట్నం కిలేశపురంలో ఉత్సవాలకు ముస్తాబైన గంగానమ్మ ఆలయం

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం నుంచి ఈనెల 23వ తేదీ వరకు వివిధ ఆలయాలు, చలువ పందిళ్లలో అమ్మవారికి ప్రతిరోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలియజేశారు.

మారెమ్మ దేవస్థానంలో..

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో ఉన్న మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం నుంచి 23వ తేదీ వరకు దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కోటగిరి వెంకట సత్యశేష సునీల్‌కుమార్, ఆలయ ఈఓ యడ్లపల్లి సీతారామయ్య శనివారం తెలిపారు. విస్సన్నపేటలో ద్వారకా నగర్‌లో ఉన్న కనక దుర్గా అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నూజివీడు: పట్టణంలోని ట్రిపుల్ ఐటీ విద్యుత్ సబ్ స్టేషన్, టౌన్ సబ్‌స్టేషన్లలో ఆదివారం మరమ్మతులు చేస్తున్నందున ఉదయం తొమ్మిది ఉంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఏ సత్యనారాయణ తెలిపారు. దీంతో పట్టణంలోని ఉషా బాలానగర్, మైలవరం రోడ్డు, గాంధీనగర్, రెడ్డిగూడెం రోడ్డు, గొడుగువారిగూడెం, నందనం తోట, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి రోడ్డు, యనాదుల కాలనీ, ముస్లింబజార్, ఢంఢంగార్డెన్, కుమ్మరిపేట, భువనగిరిపేట, ఐదు బజార్ల సెంటర్, స్టేషన్ తోట, శ్రీనివాస సెంటర్, హనుమాన్ జంక్షన్ రోడ్డు, ద్వారకా సెంటర్, చిన్నగాంధీ బొమ్మ సెంటర్, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, పీజీ సెంటర్, పెద్దగాంధీబొమ్మ సెంటర్, బ్యాంకు స్ట్రీట్, కోనేరుపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని, వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముసునూరు: పురుగు మందు తాగి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆరోగ్యం విషమించి శనివారం మృతి చెందినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. మండలంలోని లోపూడికి చెందిన చిన్ని ధర్మారావు ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం గడుపుతున్నాడు. కరోనా ఉద్ధృతంగా ఉన్న సమయంలో అతని భార్య తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో అప్పు చేసి, ఆమెకు చికిత్స చేయించాడు. అప్పులు తీరక, వడ్డీ పెరుగుతుండడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మొక్కలకు వాడగా, మిగిలిన పురుగుల మందును తాగాడు. బంధువులు అతడ్ని నూజివీడు ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి నాలుగేళ్ల కుమారుడు, 11 నెలల కుమార్తె ఉన్నారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసి, మృతదేహానికి పంచనామా, పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

కోళ్ల వ్యర్థాల రవాణా వ్యాన్ సీజ్

ముసునూరు: పోలీసుల కళ్లు గప్పి కోళ్ల వ్యర్థాలను అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేసి ముసునూరు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు శనివారం తెలిపారు. హైదరాబాద్ నుంచి ఏలూరు ప్రాంతంలోని పెదపాడు మండలంలోని వడ్డీగూడెం చెరువుల్లో చేపలకు మేతగా తరలిస్తున్న కోళ్ల వ్యర్థాల లోడు వాహనాన్ని శనివారం వాహన తనిఖీల్లో భాగంగా ముసునూరు ఆంజనేయ స్వామి కూడలి సమీపంలో బోర్డు బల్ల వద్ద అడ్డుకున్నామని పేర్కొన్నారు. వ్యాన్‌లో ఐదు టన్నుల కోళ్ల వ్యర్థాలతో ప్లాస్టిక్ సంచులు ఉన్నాయని తెలిపారు. డ్రైవర్ ఘంటసాల ఎబ్బేసు, క్లీనర్ నబగిరి రామాంజనేయులును అదుపులోకి తీసుకుని, వ్యానుతో సహా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్, క్లీనర్, వాహన యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శిక్షణాంశాలను బోధనలో అన్వయించాలి

ఆగిరిపల్లి: శిక్షణలో పొందిన అంశాలను విద్యాబోధనలో అన్వయించడం ద్వారా శిక్షణ లక్ష్యాలను సాధించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దవచ్చని ఎన్టీఆర్ జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ జీ మహేశ్వరరావు అన్నారు. మండలంలోని తోటపల్లి హీల్ ప్యారడైజ్ స్కూల్లో ఆరు రోజులుగా నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ వల్ల ఉపాధ్యాయుల్లో మరింత బోధనా సామర్థ్యాలు పెంపొందుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ఎన్నో విప్లవాత్మకమైన చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కూడా తమ వంతు పాత్ర పోషించాలన్నారు. అనంతరం హీల్ సంస్థ ఆధ్వర్యంలోని అంధుల పాఠశాల, కృత్రిమ అవయవ కేంద్రం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్లను సందర్శించి బాలబాలికలతో ముచ్చటించారు. డీపీఈటీ పర్యవేక్షకులు లలిత మోహన్, హరికిరణ్, శిక్షణాప్రాంగణ బాధ్యులు బి.సురేష్‌కుమార్, ఏఎస్ఓ అశోక్, జీసీడీఓ శాంతి, శిక్షణ కార్యక్రమ ఇన్‌చార్జి డీవీవీఆర్ పలువురు కీ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మద్యానికి బానిసై భార్యను వేధిస్తున్న వ్యక్తిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వైఎస్సార్ కాలనీకి చెందిన కడాలి దుర్గ ఆటో డ్రైవర్ శివ ప్రసాద్‌ను ఎనిమిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఇద్దరు సంతానం. కొన్నాళ్ల పాటు వీరి కాపురం సజావుగానే సాగింది. కొంతకాలంగా మద్యానికి బానిసైన శివప్రసాద్ భార్యను అనుమానించడం, మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. వేధింపులు భరించలేని ఆమె అతని నుంచి విడిపోయి పుట్టింటి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో శనివారం ఉదయం దుర్గ పనికి వెళ్లేందుకు వైఎస్సార్ కాలనీ నుంచి సితార సెంటర్‌కు చేరుకుంది. అప్పటికే అక్కడ ఉన్న ఆమె భర్త శివ బలవంతంగా ఆటో ఎక్కించుకుని ఔట్ ఏజెన్సీకి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై దాడి చేయగా తప్పించుకుని భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపటి నుంచి మూడు జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలు

గంపలగూడెం: దసరా సందర్భంగా గంపలగూడెంలో ఈ నెల 16వ తేదీ నుంచి మూడు జిల్లాల స్థాయిలో వినాయక్ యూత్ ఆధ్వర్యంలో టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్, కృష్ణా, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాల పరిధిలోని క్రీడాకారులు పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు దాతల సహకారంతో రూ.20వేలు, రూ.10వేలు, రూ.7వేలు నగదు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు. ఉత్సాహం ఉన్న వారు ముందుగా తమ ఎంట్రీలను 90107 50211లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా న్యాయపోరాటం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పోరాటాల ద్వారానే వర్గీకరణకు ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలని పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఓ హోటల్‌లో శనివారం ఉభయ రాష్ట్రాల మాలమహానాడు కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీలను విభజించాలని కుట్ర జరుగుతోందన్నారు. మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు న్యాయ పోరాటం చేసి వర్గీకరణను అడ్డుకున్నారన్నారు. సుప్రీంకోర్టు కొట్టివేసిన వర్గీకరణ అంశాన్ని మరలా తెరపైకి తెస్తున్నారని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ మద్దతుతో కొందరు వర్గీకరణ చేయాలని పట్టుబడుతున్నారన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు గురుకుల విద్యార్థినులు

ముసునూరు: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు తమ విద్యార్థినులు ఐదుగురు ఎంపికైనట్లు ముసునూరులోని ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ కె.ప్రవీణ తెలిపారు. ఇటీవల ఆల్ ఇండియా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడ పటమట జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన యోగా పోటీల్లో అండర్-14, అండర్-17 విభాగాల్లో తమ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనపర్చి, రాష్ట్ర స్థాయి పోటీలకు, జిల్లా జట్టులో స్థానం సాధించినట్లు తెలిపారు. కె.శ్రీవల్లి, వి.హాసిని, జె.హారిక, కె.తాప్సి, ఎల్.అను మొత్తం ఐదుగురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు తరఫున పాల్గొననున్నట్లు తెలిపారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థినులను, పీఈటీ నాగమల్లేశ్వరిని, ఎస్ఎంసీ చైర్మన్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

క్లుప్తంగా

ఘనంగా దసరా వేడుకలు



గుళ్లపూడి(గంపలగూడెం): గుళ్లపూడి వివేకానంద విద్యాలయంలో శనివారం ముందస్తు దసరా సంబరాలను వైభవంగా నిర్వహించారు. పలువురు చిన్నారులు ప్రత్యేక వస్త్రధారణతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాలికలు అందంగా అలంకరించి తెచ్చిన బతుకమ్మలను ఒక చోట నెలకొల్పి చుట్టూ కూర్చొని పాటలు పాడుతూ ఆటలు ఆడారు. విద్యార్థినులు ప్రదర్శించిన కోలాటం చూడముచ్చట గొల్పింది. ప్రిన్సిపాల్ బైరెడ్డి సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

ఊరు వెళుతున్నారా.. సమాచారం ఇవ్వండి

తిరువూరు: దసరా సెలవుల్లో ఇతర ఊళ్లకు వెళ్లేవారు ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తిరువూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ భీమరాజు కోరారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేటపుడు తమకు సమాచారం ఇస్తే గస్తీ ఏర్పాటు చేస్తామని, చోరీ సంఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపడతామని తెలిపారు. ఇంట్లో విలువైన నగలు, నగదు ఉంచకుండా బ్యాంకుల్లో భద్రపరచుకోవాలని సూచించారు.

నేడు ప్రత్యేక వైద్యశిబిరం

తిరువూరు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరువూరులో ఆదివారం మధుమేహ ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పట్టణ శాఖ అధ్యక్షుడు కే పాపారావు తెలిపారు. రక్తపోటు, మధుమేహం, మూర్ఛ వ్యాధిగ్రస్తులకు ఈ శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహించి రెండు నెలలకు సరిపడా మందులు ఇస్తామని పేర్కొన్నారు. తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్‌లోని నాగార్జున స్కూలు ఆవరణలో ఈ వైద్యశిబిరం జరుగుతుందని తెలిపారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



తిరువూరు: ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్ తిరువూరు మండల శాఖకు శనివారం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాయల వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పురంశెట్టి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు మచ్చా శ్రీనివాసరావు, అపర్ణ, శ్రీనయ్య, ముత్తయ్యల పర్యవేక్షణలో ఎన్నిక జరిగింది.

పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్ అవసరం



మైలవరం: ఆధునిక పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్ నేర్చుకోవడం అవసరమని మోస్ట్ ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు కాటంనేని వెంకటేశ్వరరావు తెలిపారు. నూజివీడు రోడ్డులోని మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ట్రెనింగ్ సెంటర్‌లో మోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులు, మహిళలు, యువతకు ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతకు అవసరమయ్యే కార్యక్రమాలు స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ట్రస్టు కోఆర్డినేటర్ వసుకుమార్ సులభంగా ఇంగ్లిష్ ఎలా నేర్చుకోవాలో వివరించారు. మోస్ట్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు అడుసుమిల్లి విఠల్‌బాబు, కోయ సుధ, సూర్యనారాయణ, దునకా ప్రసాద్, భాను, జమిలిరెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల ఏర్పాట్లను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం పరిశీలించారు. మంత్రితో పాటు పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, సీపీ టి.కె.రాణా, డీసీపీ విశాల్ గున్ని, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఫెస్టివల్ ఆఫీసర్ ఆజాద్, ఈఓ కేఎస్ రామారావు ఏర్పాట్లను పరిశీలించారు. సీతమ్మ వారి పాదాల వద్ద స్నానఘాట్‌ను పరిశీలించిన మంత్రి ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కెనాల్‌రోడ్డులోని క్యూలు, కనకదుర్గనగర్‌లో ప్రసాదాల కౌంటర్లు పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశామన్నారు. కొండ రాళ్లు విరిగిపడటంతో క్యూలలో కొన్ని మార్పులు చేశామన్నారు. వృద్ధులు, వికలాంగులకు క్యూ మార్గంలో ప్రత్యేకంగా టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రొటోకాల్ ఉన్న వారికి మాత్రమే వీఐపీ దర్శనం కల్పిస్తున్నామని, మూలా నక్షత్రం రోజున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని, దీని కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

ఎమ్మెల్యే ప్రతాప్ కృషి ఫలితమే కేంద్రీయ విద్యాలయం

నూజివీడు: నిరాధార వార్తలు రాస్తూ వైఎస్సార్ సీపీపై బురదజల్లడం ఎల్లో మీడియాకు నిత్యకృత్యంగా మారిందని వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. నూజివీడులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం సిద్ధం చేసిన తాత్కాలిక భవనంపై ఎల్లో మీడియాలో వెలువడిన కథనాన్ని శనివారం వారు ఖండించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాలంటేనే తాత్కాలిక తరగతి గదుల భవనాన్ని చూపించాల్సి ఉంటుందన్నారు. అందుకే మున్సిపాలిటీ నిధులు రూ.25 లక్షలు, ఎమ్మెల్యే నిధులు, ఇతర నిధులు కలిపి రూ.80 లక్షలతో ఆధునికీకరించి భవనాన్ని సిద్ధం చేశామన్నారు. చంద్రబాబు వందల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన అసెంబ్లీ, సెక్రటేరియేట్ భవనాల్లోని డొల్లతనం ఎల్లో మీడియాకు ఎందుకు కనిపించడం లేదని వారు ప్రశ్నించారు. కేంద్రీయ విద్యాలయం కోసం ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తీవ్రంగా కృషి చేయడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.25కోట్లు విలువ చేసే ఏడెకరాల స్థలాన్ని కేటాయించేలా ప్రభుత్వంతో జీఓ జారీ చేయించారన్నారు. అసలు కేంద్రీయ విద్యాలయాన్ని ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో అద్దె ప్రాతిపదికగా ఏర్పాటు చేయాలని చూస్తే, ఆ కళాశాల యాజమాన్య ముందుగా అంగీకరించి, అనంతరం వెనకడుగు వేసిందని, దీంతో మూసేసిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ఆధునికీకరించి 16 తరగతి గదులు సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపించారన్నారు. 20 రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎనిమిది కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేస్తే అందులో నూజివీడుకు ఒక విద్యాలయాన్ని మంజూరు చేసిందన్నారు. ఈ విషయం తెలియకుండా రెండేళ్ల నుంచి తరగతులు నిర్వహించడం లేదని రాయడాన్ని బట్టే ఎల్లో మీడియా ఏ దుస్థితిలో ఉందో అర్థమవుతోందన్నారు. అజ్ఞానంతో ఏదో ఒక కట్టు కథ అల్లి దుష్ప్రచారం చేయాలని చూస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదనే విషయాన్ని తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు. సీలింగ్ పడిపోయిన విషయాన్ని సంబంధిత కాంట్రాక్టర్‌కు తెలియజేశామని, వెంటనే దానిని సరిచేసి మరోసారి సీలింగ్ వేస్తానని అతను తెలిపాడని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు క్లోపల్లి ఆదినారాయణ, హరికోటి ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించే బీజేపీని పారదోలాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ

మైలవరం: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని పారదోలాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల విస్తృత సమావేశం మండల కార్యదర్శి రావూరి రమేష్‌బాబు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా బీజేపీ రెండు కోట్ల ఉద్యోగాలు, జన ధన ఖాతాల్లోకి డబ్బులు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని తదితర హామీలు ఇచ్చిందని తెలిపారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. అనిల్ అంబానీ, అదాని కార్పొరేట్ల వద్ద నుంచి కోట్లాది రూపాయలు డబ్బులు తీసుకుని గత ఎన్నికల్లో గెలిచి, వారికి లబ్ధి చేకూర్చే విధంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్‌పరం చేస్తూ కార్పొరేట్‌లకు కొమ్ము కాస్తున్న మోదీ ప్రభుత్వా న్ని తరిమికొట్టాలన్నారు. సీపీఎం ఎప్పుడూ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీ.వీ. ఆంజనేయులు, మండల నాయకులు సుధాకర్, వజ్రాల వెంకటరెడ్డి, రావుల ధనలక్ష్మి, లంక వెంకటేశ్వరరావు, పత్తి జ్యోతి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీవీ కృష్ణ

పాడి రైతుల అభివృద్ధికి కృషి

అనుముల్లంక/కొత్తపల్లి(గంపలగూడెం): పాడి రైతుల శ్రేయస్సు అభివృద్ధి ధ్యేయంగా కృష్ణా మిల్క్ యూనియన్ పనిచేస్తోందని ఆ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. గంపలగూడెం మండలం అనుముల్లంక, కొత్తపల్లిపాడి సేకరణ సెంటర్లను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన పాడి రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేపుదాణాతోపాటు యూనియన్ ద్వారా సబ్సిడీపై ఇచ్చేపశుదాణాన్ని వాడటం వల్ల పాలు, ఫ్యాట్‌శాతం పెరుగుతాయని చెప్పారు. జిల్లా యూనియన్ సరఫరా చేసే వీరవల్లి సెమెన్ను గేదెలు ఎదకి వచ్చినప్పుడు చేయించుకోవాలన్నారు. దీని వల్ల మేలుజాతి దూడలు పుడతాయన్నారు. కాల్షియంను సబ్సిడీపై తక్కువ ధరకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఏలికపాముల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు గురించి ఉచిత సూపర్ నాపైర్ గడ్డి కణువులు లాభాల గురించి వివరించారు. కృష్ణామిల్క్ యూనియన్ వినియోగదారుల నుంచి ఆర్జించిన ప్రతి రూపాయి 86 శాతం పాడిరైతుల ప్రయోజనాలకు ఖర్చు చేస్తుందన్నారు. తిరువూరు చిల్లింగ్ సెంటర్ మేనేజర్ టి.సాంబశివ మూర్తి పాల్గొన్నారు.


కొత్తపల్లిలో పాడి రైతులతో మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు

విద్యార్థుల్లో పరిశోధన నైపుణ్యం పెంచాలి

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): విద్యార్థుల్లో పరిశోధన నైపుణ్యం పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని బెంగళూరుకు చెందిన క్రీస్తు జయంతి కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ మైదూర్ శివరామ్ అన్నారు. ఈ నెల 10 నుంచి శనివారం వరకు నిర్వహించిన జాతీయయ స్థాయి ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ శిక్షణ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యా బోధనలో అధ్యాపకులు చేపట్టాల్సిన మెలకువలు తెలియజేశారు. ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు దేశాభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు పరిశోధనల ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం మైదూర్ శివరామ్‌ను సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ సాయిరామ్ పాల్గొన్నారు.


మైదూర్ శివరాజ్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య

భక్తిశ్రద్ధలతో బతుకమ్మ సంబరాలు

నూజివీడు: పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీలో శనివారం రాత్రి బతుకమ్మ సంబరాలను ప్రారంభించారు. సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా ప్రకృతిని ఆరాధిస్తూ ఈ బతుకమ్మను నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో గౌరీదేవిని పూజించి అందరూ సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటారు. ఈ తొమ్మిది రోజుల పాటు మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, గౌరీదేవిని పూజించి, ఆటపాటలతో సంబరాలు జరుపుకుంటారు. తంగేడు, బంతి, చామంతి, మందార, పారిజాతం, కమలం, తామర, గన్నేరు వంటి రకరకాల పువ్వులతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ పూజలు నిర్వహించారు. తొలిరోజు ఉదయం బతుకమ్మలను పేర్చి అమ్మవారికి నైవేద్యంగా నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి ప్రసాదాన్ని సమర్పించారు. ఈ బతుకమ్మ వేడుకలకు పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.


బతుకమ్మ సంబరాల్లో భాగంగా మహిళల కోలాటం